సాక్షి
జగిత్యాల

సోమవారం ၊ 23 ၊ అక్టోబర్ ၊ 2023

విజయీభవ..

చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా ఆనందంగా జరుపుకొనే పండుగ దసరా. జగత్తుకు మూలం.. త్రిమూర్తులకు శక్తిప్రదాత.. త్రిలోకేశ్వరి సకలాభీష్ట ప్రదాయిని దుర్గామాత దుష్ట శిక్షణ చేసిన రోజు విజయదశమి. చేసే ప్రతిపనిలోనూ విజయం సాధించాలని కోరుకుంటూ శమీవృక్షాన్ని పూజించడం సంప్రదాయం. ఇలాంటి దసరా రోజు యంత్ర, వాహన, పనిముట్లకు పూజలు చేయడం ఆనవాయితీ. నేడు విజయదశమి..



న్యూస్‌రీల్

సింహ వాహనంపై శ్రీలక్ష్మీనృసింహులు



సింహవాహనంపై శ్రీలక్ష్మీనృసింహులు

ధర్మపురి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఆదివారం సాయంత్రం సూర్యవాహనంపై శ్రీయోగా, ఉగ్రలక్ష్మీనృసింహ స్వాములను ఆసీనులను చేసి పట్టణ పురవీధులమీదుగా ఊరేగించారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

మహాగౌరిగా అమ్మవారు



మహాగౌరిగా దర్శనమిస్తున్న అమ్మవారు

ధర్మపురి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆదివారం మహాగౌరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం రామలింగేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా జరిపిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలి

- జగిత్యాల అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు



చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్న ఏఎస్పీ

మెట్‌పల్లిరూరల్: వాహనాల తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. ఆదివారం మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండిహనుమాన్ ఆలయ సమీపంలోని అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ వద్ద ఆయన వాహనాల తనిఖీలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అలాగే రహదారిపై చెక్‌పోస్ట్ ఉన్నట్లు దూరప్రాంతం నుండి ఏర్పడే విధంగా సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమించి ఎవరైనా నగదు, మద్యం తరలిస్తే సీజ్ చేయాలని సూచించారు. ప్రతిరోజు సీఐ లేదా ఎస్సై స్థాయి అధికారి చెక్‌పోస్ట్ వద్ద ఉండాలని ఆదేశించారు. మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి ఎస్సైలు ఉమాసాగర్, చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్‌లో..

కథలాపూర్: జగిత్యాల - రాజన్న సిరిసిల్ల జిల్లాల సరిహద్దు.. మండలంలోని కలిగోటలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ప్రభాకర్‌రావు తనిఖీ చేశారు. కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, కథలాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ ఉన్నారు.

24 గంటల్లో రూ.26,64,945 స్వాధీనం

- 68.16 లీటర్ల లిక్కర్ సీజ్
- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 24 గంటల్లో వాహనాల తనిఖీల్లో మొత్తం రూ.26,64,945 నగదు, రూ.25,850 విలువైన 60.16 లీటర్ల లిక్కర్, రూ.5,48,850 విలువైన 90.62 గ్రాముల బంగారం పట్టుకుని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించామని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలకు మించి డబ్బులు తీసుకెళ్లరాదని, ఒకవేళ తీసుకెళ్తే రశీదు, తగిన పత్రాలు తప్పనిసరి అని పేర్కొన్నారు. డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100కు లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.



కోరుట్లలో బతుకమ్మతో మహిళ



రాయికల్: పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రాయికల్: బతుకమ్మతో యువతి



రాయికల్: బతుకమ్మతో చిన్నారి



జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కోరుట్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సద్దుల సంబరం

జగిత్యాలటౌన్/రాయికల్/కోరుట్ల: సద్దుల బతుకమ్మను మహిళలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. బతుకమ్మలను అందంగా పేర్చి.. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆటపాటలతో హోరెత్తించారు. వెళ్లిరా గౌరమ్మా.. వెళ్లి రావమ్మా.. వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా అంటు భక్తితో కొలిచారు. అనంతరం ఆయా గ్రామాలు, పట్టణాల్లోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



రాయికల్: బతుకమ్మతో యువతి



కోరుట్లలో బతుకమ్మ ఆడుతున్న యువతులు



బతుకమ్మతో చిన్నారి



రాయికల్: బతుకమ్మతో యువతి



రాయికల్: సెల్ఫీ తీసుకుంటూ



జగిత్యాలటౌన్: బతుకమ్మలతో యువతుల ఆనందం



రాయికల్: బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

బరిలో బండి.. ఈటల.. అర్వింద్

- ఉమ్మడి జిల్లా నుంచే సీఎం అభ్యర్థులు..!
- బీసీ సీఎం నినాదంతో అనుచరుల్లో ఉత్సాహం
- తొమ్మిది స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన కమలం
- హుజూరాబాద్, గజ్వేల్‌లో రెండుచోట్ల బరిలో రాజేందర్
- 19 ఏళ్ల తరువాత రెండు స్థానాలకు కరీంనగర్ నేత పోటీ

జంగ్ తెలంగాణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ బరిలో నిలిచే బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదలైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 స్థానాలు ఉండగా.. తొమ్మిది స్థానాలకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. తొలిజాబితా అభ్యర్థులకు శనివారం రాత్రే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఫోన్ చేసి పోటీకి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించినా అధికారికంగా ప్రకటించేవరకూ ఈ విషయాన్ని ఎవరూ వెల్లడించలేదు. 2018 ఎన్నికలతో పోల్చితే నాయకుల విషయంలో స్పష్టమైన తేడా కనిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు స్థానాల్లో ప్రాతినిధ్యం కరవవడం.. లేదా పొత్తులతో సాగే చరిత్ర ఉన్న బీజేపీ తాజాగా బలోపేతమైంది. ప్రస్తుతం ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు, ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే, అలాగే మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ, మాజీ ఎమ్మెల్యే బరిలో ఉండటం గమనార్హం.

పార్టీ ప్రకటించింది వీరినే..

- కోరుట్లకు ధర్మపురి అరవింద్, జగిత్యాలకు భోగ శ్రావణి, ధర్మపురికి ఎస్.కుమార్, చొప్పదండికి బొడిగె శోభ, రామగుండంకు కందుల సంధ్యారాణి, సిరిసిల్లకు రాణీ రుద్రమదేవి, కరీంనగర్‌కు బండి సంజయ్, మానకొండూరుకు ఆరెపల్లి మోహన్, హుజూరాబాద్‌కు ఈటల రాజేందర్ పేర్లను పార్టీ ప్రకటించింది.

ఈటల తన సొంత నియోజకవర్గమైన హుజూరాబాద్‌తోపాటు ప్రస్తుతం సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నుంచి కూడా బరిలోకి దిగనుండటం విశేషం. జిల్లా చరిత్రలో కేసీఆర్ తరువాత రెండుసార్లు బరిలోకి దిగుతున్న ఏకైక నాయకుడు ఈటల కావడం గమనార్హం. 2004లో కరీంనగర్ ఎంపీ, సిద్దిపేట అసెంబ్లీకి పోటీ చేసిన కేసీఆర్.. రెండుచోట్లా విజయం సాధించారు. తరువాత సిద్దిపేట స్థానానికి రాజీనామా చేశారు. దాదాపు 19 ఏళ్ల తరువాత కరీంనగర్ నుంచి రెండుచోట్ల అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తుండటం విశేషం.

ముగ్గురు సీఎం అభ్యర్థులు

- బీసీ సీఎం నినాదంతో బీజేపీ ఈసారి ఎన్నికల బరిలోకి దిగే యోచనలో ఉంది. పార్టీలో బీసీ సీఎం అభ్యర్థి ప్రతిపాదన రాగానే.. ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల మధ్య పోటీ మొదలైంది. మరోవైపు తాను ఏమాత్రం తక్కువా..? అన్నట్లు కోరుట్ల అసెంబ్లీ నుంచి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ రంగంలోకి దిగారు.
- బండి సంజయ్ 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గంగుల కమలాకర్ చేతిలో పరాజయం పాలయ్యారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా విజయం సాధించారు. ఆ తరువాత రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టి బీజేపీకి ఊపు తెచ్చారు. దుబ్బాక, జీహెచ్ఎంసీ, హుజూరాబాద్ ఎన్నికల్లో బీజేపీని విజయతీరాలకు చేర్చారు. 8శాతం ఉన్న ఓటుబ్యాంకును అమాంతం పెంచారు. పార్టీ తరపున బీసీ సీఎంగా తమ నాయకుడే ఉండాలని రాష్ట్రవ్యాప్తంగా సంజయ్ అనుచరులు కోరుకుంటున్నారు.
- తెలంగాణ ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ వేదికగా రాజకీయ ఆరంగేట్రం చేసిన ఈటల రాజేందర్ 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021లో వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా, శాసనసభాపక్ష నేతగా పనిచేసిన అనుభవంతో రాజేందర్ సైతం పార్టీ సీఎం అభ్యర్థి అవుతారని ఆయన అనుచరులు చెప్పుకుంటున్నారు.
- ఎలాగైనా అసెంబ్లీ బరిలో ఉండాలన్న పట్టుదలతో కొంతకాలంగా ధర్మపురి అర్వింద్ కోరుట్లలో చాపకింద నీరులా పనిచేసుకుంటూ వెళ్తున్నారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు కుమారుడు సంజయ్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్నారు. సంజయ్ కొత్త అభ్యర్థి కావడం, తాను ఎంపీగా ఉన్న నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోనే కోరుట్ల ఉండటం, తన అమ్మమ్మ ఊరు కావడం, సొంత సామాజికవర్గం సహకారం తదితరాల లెక్కలతో అర్వింద్ ఈసారి కోరుట్లపై కన్నేశారు.

పోటీకి బండి, ఎస్.కుమార్ అనాసక్తి..

కేంద్రమంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి వస్తుందని ప్రచారం జరుగుతున్న క్రమంలో అసెంబ్లీకి పోటీ చేయాలని ఆదేశాలు రావడంపై బండి సంజయ్.. అసలు తనకు మాట మాత్రమైనా చెప్పకుండా ధర్మపురిలో పోటీ చేయాలని చెప్పడంపై ఎస్.కుమార్ అసంతృప్తితో ఉన్నారని సమాచారం.

బండి సంజయ్



జన్మదినం: 11-07-1971
విద్యార్హతలు: గ్రాడ్యుయేషన్
స్వగ్రామం: కరీంనగర్
అనుభవం: 2005, 2014లో కార్పొరేటర్, 2014, 2018 ఎమ్మెల్యే స్థానానికి పోటీ, 2019 ఎంపీగా విజయం.
- అదనపు సమాచారం: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి, ప్రస్తుతం జాతీయ ప్రధాన కార్యదర్శి

సామాజిక వర్గం: మున్నూరుకాపు

ఈటల రాజేందర్



జన్మదినం: 20-03-1964
విద్యార్హతలు: పీజీ (ఉస్మానియా)
స్వగ్రామం: కమలాపూర్ (ప్రస్తుతం హన్మకొండ జిల్లా)
అనుభవం: ఏడుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి, శాసనసభ పక్షనేత
- అదనపు సమాచారం: 2021లో బీజేపీలో చేరిక. చేరికల కమిటీ చైర్మన్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్.

సామాజిక వర్గం: ముదిరాజ్

ధర్మపురి అర్వింద్



జన్మదినం: 25-08-1976
విద్యార్హతలు: ఎంఏ.పొలిటికల్ సైన్స్
స్వగ్రామం: నిజామాబాద్
అనుభవం: 2019 నిజామాబాద్ ఎంపీ,
- అదనపు సమాచారం: కేంద్ర వాణిజ్య స్టాండింగ్ కమిటీ సభ్యులు

సామాజికవర్గం: మున్నూరుకాపు

బొడిగె శోభ



జన్మదినం: 1972
విద్యార్హతలు: పదవ తరగతి
స్వగ్రామం: వెంకటేశ్వర్లపల్లె, సైదాపూర్ మండలం
అనుభవం: 2001 శంకరపట్నం జెడ్పీటీసీ, 2014లో ఎమ్మెల్యే (బీఆర్ఎస్), 2018 ఎమ్మెల్యేగా ఓటమి.
- అదనపు సమాచారం: చొప్పదండి బీజేపీ ఇన్‌చార్జి

సామాజికవర్గం: ఎస్సీ (మాదిగ)

ఎస్.కుమార్



జన్మదినం: 10-10-1966
విద్యార్హతలు: ఎంసీజే, ఎల్ఎల్ఎం (ఉస్మానియా)
స్వగ్రామం: గోదావరిఖని
అనుభవం: రామగుండం మున్సిపాలిటీ చైర్మన్ 2004, 2009 ధర్మపురి ఎమ్మెల్యే స్థానానికి, 2019 పెద్దపల్లి ఎంపీ స్థానానికి పోటీ చేసిన అనుభవం
- అదనపు సమాచారం: జర్నలిస్టుగా అనేక అవార్డులు, బీజేపీ జాతీయస్థాయిలో పలు పదవుల నిర్వహణ.

సామాజికవర్గం: ఎస్సీ (మాల)

ఆరెపల్లి మోహన్



జన్మదినం: 6-6-1955
విద్యార్హతలు:ఎంకామ్,ఎల్ఎల్‌బీ
స్వగ్రామం: మానకొండూరు
అనుభవం: సర్పంచి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, విప్. 2009లో మానకొండూరు ఎమ్మెల్యే, 2014, 2018లో అక్కడ నుంచే పరాజయం.
- అదనపు సమాచారం: 2019లో బీఆర్ఎస్‌లో చేరిక, టికెట్ ఆశించి భంగపడి కమలం గూటికి.

సామాజికవర్గం: ఎస్సీ (మాదిగ)

గుండెపోటుతో మహిళ మృతి

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన దేశవేని లక్ష్మి (45) గుండెపోటుతో మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మి ఆదివారం మధ్యాహ్నం చాతిలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త రాజం, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

ఆనందం.. అంతలోనే విషాదం

- కారును తప్పించబోయి లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం
- యువకుడి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు
- దసరా పండుగకు ఇంటికి వెళ్తుండగా ఘటన



రంజిత్ మృతదేహం



సంజయ్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

మెట్‌పల్లిరూరల్: పండుగ పూట విషాదం నెలకొంది. దసరా పండుగకు ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామానికి చెందిన శాకపురం రంజిత్ (23) హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రంజిత్ ఇటీవల పనినిమిత్తం కామారెడ్డికి వెళ్లాడు. సోమవారం దసరా పండుగ కావడంతో హెల్పర్ సంజయ్‌తో కలిసి ఆదివారం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట శివారులోకి చేరుకోగానే ముందు వెళ్తున్న కారును తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రంజిత్ అక్కడికక్కడే మృతిచెందగా సంజయ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. లారీకింద స్వల్ప మంటలు చెలరేగడంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. స్థానికులు 108కు సమాచారం అందించగా రంజితమృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, గాయపడిన సంజయ్‌ను చికిత్స కోసం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఉంది.

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: బీఆర్ఎస్ గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కోనాపూర్, రంగపేట, అర్పపల్లి, లచ్చక్కపేట నాగునూర్ గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కోల శ్రీనివాస్, పార్టీ ప్రధాన కార్యదర్శి తోడేటి శేఖర్ గౌడ్, సింగిల్‌విండో వైస్ ఎంపీపీ, పల్లపు బాపిరాజు, సర్పంచులు బెక్కెం జమున, పల్లపు వెంకటేశ్, కాసుగంటి రమణారావు, కొండ శ్రీలత, కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే సంజయ్

పథకాలను చూసే బీఆర్ఎస్‌లోకి..

జగిత్యాలరూరల్: బీఆర్ఎస్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పొలాస గ్రామానికి చెందిన 50 కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు బాల ముకుందం నాయకులు నరేశ్, శంకర్, సురేశ్, పోచమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల ఖిలాపై కాషాయ జెండా ఎగురవేస్తాం..

జంగ్ తెలంగాణ

- బీజేపీ జగిత్యాల అభ్యర్థి శ్రావణి

జగిత్యాలటౌన్: రానున్న ఎన్నికల్లో జగిత్యాల ఖిలాపై కాషాయ జెండా ఎగురవేసేలా చూడాలని బీజేపీ జగిత్యాల అభ్యర్థి భోగ శ్రావణి కోరారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని తహసీల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రచారం ప్రారంభించారు. రాచరిక పాలనకు చరమగీతం పాడేందుకే తను మున్సిపల్ చైర్మన్ పదవిని వదిలి బీజేపీలో చేరానని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఆమె వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి, పట్టణ ఉపాధ్యక్షుడు వీరబత్తిని అనిల్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, కోశాధికారి దశరథరెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబారి కళావతి, నలువాల తిరుపతి పాల్గొన్నారు.

కాళేశ్వరం అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తాం

- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాలటౌన్: కాళేశ్వరం ప్రాజెక్టులో రీడిజైన్ పేరుతో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ హయాంలో రూ.38 వేల కోట్లతో గోదావరి నదీ జలాల్లో వృథాగా పోతున్న నీటిని ఒడిసి పట్టేందుకు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రూపొందిస్తే.. రీడిజైన్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరు మార్చి రూ.లక్షా 20వేల కోట్లకు పెంచి భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. నాణ్యతా లోపంతో మేడిగడ్డ బ్యారేజ్ 20వ పిల్లర్ కుంగి ప్రమాదం పొంచి ఉందన్నారు. వరదల్లో మునిగిన 11 పంపుసెట్లను చూసేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు సీఎం కేసీఆర్‌ను ఓడిస్తారని జీవన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజంగి నందయ్య, ధర రమేశ్, ఆకుల నాగరాజు, బాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

గుండెపోటుతో రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి

మల్లాపూర్ : మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఎదురుగట్ల సుదర్శన్ ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. సుదర్శన్ ఉపాధ్యాయ వృత్తితో పాటు జిల్లాలో ప్రముఖ గేయ రచయిత, సాహితీవేత్తగా గుర్తింపు పొందారు. మృతుడికి భార్య భూలక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుదర్శన్ మృతిపట్ల సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ రాజనర్సయ్య, మాజీ ఎంపీటీసీ నరేశ్, నాయకులు రాజేందర్, న్యామతేమాద్ రాజుతోపాటు పలువురు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.



సుదర్శన్ (ఫైల్)

28న కట్కాపూర్ సబ్‌సెంటర్‌కు క్వాస్ టీం



రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాస్

రాయికల్: మండలంలోని కట్కాపూర్ సబ్‌సెంటర్‌ను ఈనెల 28న క్వాస్ టీం సందర్శించనున్నట్లు డెప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కట్కాపూర్ హెల్త్‌సెంటర్‌ను సందర్శించి రికార్డు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో గర్భిణుల నమోదు, ఓపీ, ఐపీ రికార్డులు, ప్రసవాల సంఖ్య, బీపీ, షుగర్, టీబీ, క్షయ, ఎయిడ్స్ సంబంధిత రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ సతీశ్, వైద్య సిబ్బంది శ్రీధర్, రాహుల్, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుడి ఆత్మహత్యాయత్నం

- దొంగల నుంచి బంగారం కొనుగోలు..?
- విచారణకు వచ్చిన నిజామాబాద్ పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని రాంబజార్‌లో బంగారం దుకాణం నిర్వహిస్తున్న ప్రసాద్ అనే వ్యక్తి వద్దకు నిజామాబాద్ సీసీఎఫ్ పోలీసులు ఆదివారం విచారణకు వచ్చారు. దీంతో సదరు దుకాణం నిర్వాహకుడు దుకాణంలోని తేజాబ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిజామాబాద్ జిల్లాలో పలు దొంగతనాలకు పాల్పడిన దొంగలు ఐదు రోజుల క్రితం నిజామాబాద్ పోలీసులకు చిక్కారు. వారిని పోలీసులు విచారించగా దొంగిలించిన బంగారాన్ని ఓ మధ్యవర్తురాలి సాయంతో జగిత్యాలలో ఓ వ్యాపారికి విక్రయించినట్లు చెప్పారు. ఈ క్రమంలో నిజామాబాద్ సీసీఎఫ్ సీఐ రమేశ్ ఆధ్వర్యంలో నిందితులను తీసుకుని జగిత్యాలకు విచారణ కోసం వచ్చారు. నిందితులు ఇచ్చిన వివరాల ఆధారంగా వ్యాపారి ప్రసాద్‌ను పోలీసులు వివరాలు అడుగుతుండగానే.. దుకాణంలో ఉన్న తేజాబ్ తాగాడు. పోలీసులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మల్లాపూర్ : గల్ఫ్ కార్మికుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అని గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక దమామ్ ఇన్‌చార్జి బాలసాని లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సౌదీలోని దమామ్‌లో గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని, గల్ఫ్‌లో చనిపోయిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.